క్లుప్తంగా

ఘనంగా మిలాద్ ఉన్ నబి


ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

పోలవరంరూరల్: పోలవరంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అహలె సున్నత్ వల్ జమాత్ మసీదు కమిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ సల్లల్లహు ఆలైహివసల్లం జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబి నిర్వహిస్తామన్నారు. ప్రవక్త మహ్మద్ చూని మార్గమైన సత్యం, అహింస, సౌభ్రాతృత్వం, సమానత్వం అని, వీటిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పోలవరం వీధుల్లో ఊరేగంపు నిర్వహించారు. ముస్లింలు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


పారిజాతగిరిలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భాద్రపద మాస శ్రవణా నక్షత్ర సందర్భంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు.

బంగారు ముక్కుపుడక సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అమెరికాలో నివసిస్తున్న వంగా రాము కుటుంబీకులు రూ.48,500 విలువైన బంగారు ముక్కుపుడకను సమర్పించారని రాజాన సత్యనారాయణ తెలిపారు. స్థానిక తెల్లగొర్ల వెంకటేశ్వరరావు కుటుంబీకులు రూ.25,116 విరాళంగా అందజేశారని, దాతలను సత్కరించామని వివరించారు. ఈనెల 7న భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం నిర్వహిస్తామన్నారు.

దసరా రాట పూజ

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం దసరా ఉత్సవాల పనులను ప్రారంభించే నిమిత్తం రాట పాతే పూజాకార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ సేవలు మరపురానివి

పోలవరం రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతలో ఒకరైన రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) సేవలు మరపురానివని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ కొనియాడారు. ఆర్ఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని చేగొండపల్లి, ఇటికలకోట, బోడిగూడెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. పార్టీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఆర్ఎస్ ప్రథమ వర్ధంతి సభ స్థానిక సీపీఎం కార్యాలయంలో చల్లారి మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆర్ఎస్ సేవలను పార్టీ పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు గుర్తుచేశారు.

శాంతి, సామరస్యంతో వేడుకలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అన్ని మతాల ప్రజలు శాంతి, సామరస్యంతో మెలుగుతూ తమతమ పండుగలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సూచించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వాహకులతో శుక్రవారం వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ వేడుకలు నిర్వహిస్తున్న రెండు వర్గాల నిర్వాహకులు పోలీస్ శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ఇబ్బందులు సృష్టించకుండా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: పరిసరాల పరిశుభ్రతతోనే కీటక జనిత వ్యాధులను నియంత్రించవచ్చునని పూళ్ల ఆరోగ్యవిస్తరణాధికారి వైపీ లక్ష్మణరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని కోడూరుపాడు, పూళ్ల సచివాలయాల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. దోమల ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రపరిశీలన చేశారు. ఇంటింటికీ వెళ్లి గృహ యాజమానులకు పలు సూచనలు చేశారు.

‘గురు’తర బాధ్యతకు మించినది లేదు

మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: ‘గురుతర బాధ్యతకు మించిన వృత్తి వేరొకటి లేదని, సృష్టిచేత గౌరవింపబడే వ్యక్తి గురువు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం కొయ్యలగూడెంలో విద్యార్థిని నూకల నేహానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఉపాధ్యాయుడు ఎస్‌కే గాలిబ్‌ను ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ, నేహానాయుడుతో కలిసి బాలరాజు సత్కరించారు. ఎనిమిది పదుల వయసుకు చేరినా ఇప్పటికీ ఆయన విద్యార్థులకు చదువు నేర్పుతూ ఉండడం స్ఫూర్తిదాయకమన్నారు. బాలరాజుతో సహా పార్టీ శ్రేణులు గాలిబ్ ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఎంపీటీసీలు గంటా శ్రీను, ఎస్‌కే బాజీ, జాన్ డేవిడ్ కింగ్, నాయకులు గంటా రాంబాబు, గంటా రమేష్, డి.బాబురావు, జె.బాబ్జి, మట్టా సత్యనారాయణ, సీహెచ్ రవి, ఏలేటి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

చింతలపూడి : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంఎల్‌కే శ్రీనివాస్, మండలానికి చెందిన ఉపాధ్యాయులు బెజ్జంకి మురళీకృష్ణ, పిల్లేటి పాండురంగారావు, టీవీఎస్ఎన్ రాజు, తెరెసమ్మ, పగడాల సాంబశివరావు, ఎం అనిల్ కుమార్, బాజీను సన్మానించారు. మానవత అధ్యక్షులు యడ్లపల్లి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, చైర్మన్ అప్పారావు, కార్యదర్శి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడిలో..

కామవరపుకోట: మండలంలో తడికలపూడి గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ముకల సుజాత, మేకల రంగమ్మ, ప్రొద్దుటూరి కమలాకర్, ఆకుల సుధీర్ కుమార్లను సన్మానించారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గురువాయిగూడెం మానవత కల్యాణ మండపంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఈమని శశి కుమార్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు మల్లాబత్తుల పోతురాజు, లంక రఘురాం, దల్లి కేదారేశ్వర రెడ్డి, యూఎస్ చందుమణి, మల్లవెల్లి ఆనంద కిషోర్, చిట్టిబొమ్మ సౌజన్య, కండవల్లి ఝాన్సీరాణిలను శాలువాలు పూలదండలతో ఘనంగా సన్మానించారు. మానవత జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ, మానవత సెంట్రల్ కమిటీ కన్వీనర్ త్రిపుర రమేష్, రీజియన్ చైర్మన్ గల్లీ ఆంజనేయరెడ్డి దితరులు పాల్గొన్నారు. చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కల్చరల్ కమిటీ, స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొమ్ముకూరి నాగేశ్వరరావు, పీవీఆర్ రాజ్యలక్ష్మి, అయినపర్తి చంద్రశేఖర్, సరళాదేవిలను సత్కరించారు.

శ్రీవారి దేవస్థానం హైస్కూల్ హెచ్‌ఎంకు సత్కారం

ద్వారకాతిరుమల: తాడేపల్లిగూడెంలో డైమండ్ లయన్స్‌క్లబ్ వారు స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పప్పు శేషుకుమార్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ పెరిచర్ల మురళీకృష్ణ, పాస్ట్ గవర్నర్ గట్టిం మణిక్యాలరావులు శేషుకుమార్‌కు దుశ్శాలువా కప్పి, షీల్డ్‌ను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.


కొయ్యలగూడెం : ఉపాధ్యాయుడు గాలిబ్‌ను సన్మానిస్తున్న బాలరాజు


చింతలపూడి : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సున్నం

బుట్టాయగూడెం: మండలం కేఆర్‌పురం ఐటీడీఏ సీఎంఓ సున్నం శ్రీనివాసరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును వైఎస్సార్‌సీపీ విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పి.కల్పలత, పి.చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. శ్రీనివాసరావు ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞత తెలిపారు. వైఎస్సార్‌టీఏ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్, ఏలూరు జిల్లా నాయకులు కందుల ప్రకాష్, వి.రామ్మోహన్‌లు శ్రీనివాస్‌ను అభినందించారు.


బుట్టాయగూడెం : శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు


కామవరపుకోట : తడికలపూడిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: శేషుకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: మండలంలోని కట్టవపాదలగూడెం, వెంకట రామానుజపురం గ్రామాల్లో 3 ఫేజ్ 24 గంటల లైన్ ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపాక గొమ్ములో అగ్నిప్రమాదం

వేలేరుపాడు: మండలంలోని రేపాక గొమ్ము గ్రామంలో తెల్లం బాయమ్మకు చెందిన పూరిల్లు శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. శుక్రవారం సాయంత్రం స్నానం కోసం కట్టెల పొయ్యిపై నీటిని వేడి చేసుకునేందుకు పెట్టింది. అనంతరం గ్రామంలో నిత్యావసర వస్తువుల కోసం ఓ కిరాణా దుకాణానికి వెళ్లింది. ఇంతలోనే పొయ్యి మంట తాటాకు ఇంటి సూరికి అంటుకోవటంతో మంటలు చెలరేగాయి. దీంతో బాయమ్మ సర్వసం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలింది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించిందని చెబుతున్నారు.

అత్తమామలపై కేసు

టి.నరసాపురం: అల్లుడుని కొట్టి గాయపరిచిన అత్తమామలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం జయబాబు తెలిపారు. బందంచర్ల గ్రామానికి చెందిన శిలారపు రవికుమార్‌కి వివాహమై ఒక బాబు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన అత్త మామలు రాచప్రోలు నక్షత్రం ప్రసాద్‌లతో గత కొంతకాలంగా గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న రవికుమార్ తన భార్యను తీసుకు రావడానికి అత్త వారింటికి వెళ్లాడు. అత్త మామలు తమ కుమార్తెను పంపమని అల్లుడుతో గొడవ పడ్డారు. మామ ఇటుక రాయితో మూతిపై కొట్టగా గాయమైంది. అత్త కళ్లలో పసుపు కొట్టింది. గాయపడిన రవికుమార్‌ను తండ్రి మద్ది రాముడు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై జయబాబు శుక్రవారం తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలు

ద్వారకాతిరుమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలే రైతుల ఆత్మహత్యలకు కారణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం నాగులపల్లిలో కూరగాయల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ షెడ్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘ మండల మహాసభలో శ్రీనివాస్ మాట్లాడారు. రైతాంగ సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయపాటి సత్యనారాయణ, కార్యదర్శిగా గుర్రం రాంబాబు, ఉపాధ్యక్షులుగా నందమూరి త్రినాథ్, జె.మంగమ్మ, సహాయ కార్యదర్శిగా తూంపాటి మురళీకృష్ణ, గుర్రం పాపారావు, మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బాణసంచా తయారీకి అనుమతులు లేవు

దెందులూరు: బాణసంచా తయారీకి అనుమతులు లేవని ఎస్సై రాజమల్లు శివాజీ అన్నారు. గురువారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు గోడౌన్స్‌లో మెరుపు దాడులు చేస్తామన్నారు. అక్రమంగా నిల్వ ఉంచినా, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

‘కూటమి’ తీరుపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం


పోలవరం : మాట్లాడుతున్న బుగ్గా మురళీకృష్ణ


బొడ్డు వెంకటేశ్వరరావు

చింతలపూడి : జిల్లాలో రైతులు యూరియా కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం చింతలపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా స్టాక్ ఉందని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవానికి రైతులకు యూరియా అందడం లేదని వివరించారు. సమయానికి రైతులకు అవసరమైన ఎరువులు అందకపోవటం వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా యూరియా కోసం రైతులు బారులు తీరి ఇబ్బందులు పడుతుంటే, ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి రైతులను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా ఎక్కువగా వాడితే క్యాన్సర్ వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుంటే, ఫంక్షన్లలో బఫే భోజనం చేయాలంటే క్యూలో నిలబడాలి కదా, అలాగే యూరియా కోసం క్యూలో నిలబడితే తప్పేంటని వ్యవసాయ శాఖ మంత్రి అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకూ యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని బొడ్డు స్పష్టం చేశారు.

యూరియా కోసం పడిగాపులు

పోలవరం రూరల్: యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ అన్నారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటిందని రైతులు ఒక యూరియా బస్తా కోసం సొసైటీ వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు, కొండవాగుల ప్రభావంతో పోలవరం ప్రాంతంలో నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయని వివరించారు. ముంపు నుంచి తేరుకున్న పొలాలకు యూరియా వేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. రైతన్నే వెన్నుముక అని చెబుతున్నప్పటికీ యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పంచాయతీ ఉపసర్పంచ్ కోరసిక శ్రీను, సిగ్గెన వెంకటరత్నం, ఈర్నాల జాన్‌బాబు, కడితాల రాజు, కె.జాజులు, తదితరులు పాల్గొన్నారు.

9న ఆందోళన

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను కూడా సరఫరా చేయలేకపోతోందని వైఎస్సార్‌సీపీ టి.నరసాపురం మండల అధ్యక్షుడు ఎస్‌వీకేహెచ్ శ్రీనురాజు విమర్శించారు. యూరియా కొరతపై ఈ నెల 9న జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. రైతులు, కార్యకర్తలతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులంతా హాజరు కావాలన్నారు.

వినాయకా.. వెళ్లిరా ఇక

ఘనంగా ఊరేగింపులు, నిమజ్జనాలు

ద్వారకాతిరుమల: గణేష్ నిమజ్జనాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. చంద్ర గ్రహణం కారణంగా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు శనివారంతో ముగియనున్నాయి. ద్వారకాతిరుమల గ్రంథాలయం ప్రాంతంలో నెలకొల్పిన గణేష్ విగ్రహాన్ని శుక్రవారం చిత్ర విచిత్ర వేషధారణలు, డిజే సందళ్లు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువకుల డాన్స్‌ల నడుమ గ్రామంలో ఊరేగించారు. శ్రీవారి దేవస్థానం హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సైతం ఊరేగించారు. రాత్రి స్వామివారి విగ్రహాలను పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు.

కృష్ణాపురంలో..

టి.నరసాపురం: స్థానిక కృష్ణాపురం గ్రామంలో బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని యువకులు గ్రామ పెద్దలు మహిళలు వరసిద్ధి వినాయక స్వామి నిమజ్జన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మహిళలు లంబాడీ సాంప్రదాయతో బిందెలు తలపై పెట్టుకుని నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అన్నదానం చేశారు. అడపా నాగరాజు, ఆచంట సూర్యనారాయణ, పిన్నమనేని రాధాకృష్ణ, ఆచంట బాబి, రామకృష్ణ, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక షేక్ ముస్తాఫా వీధిలో వంశీ రాజు ఇంటి వద్ద నెలకొల్పిన వినాయక మండపం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. శ్రీనివాసపురంలో పోస్టాఫీసు వద్ద కొలువైన వినాయకుడి గుడి వద్ద శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా భారీ అన్నసమారాధన పోల్నాటి మిల్లి సత్యనారాయణ సహకారంతో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పోల్నాటి ప్రభాకర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పారేపల్లి నాగార్జున, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోల్నాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల : ఊరేగింపులో శక్తి వేషధారణలు


ద్వారకాతిరుమల : గణేషుని ఊరేగింపు


టి.నరసాపురం: వినాయక ఊరేగింపు


జంగారెడ్డిగూడెం : అన్నసమారాధనలో గురునాథరావు


శ్రీనివాసపురం పోస్టాఫీసు వద్ద అన్నసమారాధన

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటులో జాప్యం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దుగ్గిరాల రామారావు కుటుంబానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన రూ.20 వేలు సాయం అందించారు. దుర్గారావుతో పాటు అగ్ని ప్రమాద బాధితులైన తోటసాని సత్యనారాయణ దంపతులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన గంగరాజు, కాకి నాగేశ్వరరావు, శ్రీరంగనిలయం విశ్వనాథ్, అనంతల సుబ్బారావు, ఆకుల తాతారావు, పాముల నాగమునిస్వామి, కుర్రి తాతబ్బాయి, దాసరి నాగరాజు, నేలపోలు సూరిబాబు, షేక్ పండు, తమ్మిశెట్టి శివ, తమిర్పి వీర్రాజు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పి-4 విధానంతో కార్పొరేటీకరణ

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి పి-ఫోర్ పేరుతో అన్ని రంగాల్లోనూ పూర్తిస్థాయి ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలు అవలంబిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సీఐటీయూ 16వ నగర మహాసభలు సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ పతాకాన్ని నగర కమిటీ అధ్యక్షుడు వీవీవీఎస్ ప్రసాద్ ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎం ఇస్సాక్, రజిని వ్యవహరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పీ ఫోర్ పథకాలు విధానాల ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుంచి వైదొలుగుతోందని విమర్శించారు. ఇప్పటికే విద్యారంగం ప్రైవేటీకరణ కారణంగా లక్షల రూపాయలు ఫీజులు చెల్లించలేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే నూతన మెడికల్ కాలేజీల్లో పీ ఫోర్ భాగస్వామ్యం అని చెప్పి సామాన్యులకు వైద్య విద్యను, వైద్యాన్ని పూర్తిస్థాయిలో దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో కార్మిక ఉద్యోగ వర్గానికి భరోసా లేని విధానాల వల్ల దోపిడీ పెరిగిందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలు సరికాదని హితవు పలికారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (టూటౌన్): హెచ్ఐవీ /ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఆదర్శ రురల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు రైల్వే స్టేషన్ ఆటో స్టాండింగ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. శిరీష మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చిన్న చూపుకుండా ఉండడం వంటి పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ సంబంధిత పోస్టర్ విడుదల చేశారు.